# శ్రీ షిరిడీ సాయిబాబాతో సాంగత్యము చేసిన శ్రీ శేషుదేవులు

అవతార్ శ్రీ మెహర్ బాబా వారు గురువులు, సద్గురువులు అందరూ నిరాకారములో కలుసుకుంటూ మానవజాతి భవిష్యత్తును గూర్చి చర్చించుకుంటూ, నిర్ణయాలు తీసుకుంటూ వాటిని ప్రపంచముపై అమలు పరుస్తూ ఉంటారని చెప్పియున్నారు. ఆ విధముగానే సద్గురు శ్రీ సాయిబాబా వారు కూడా సద్గురు శ్రీ శేషుబాబు వారి వద్దకు అప్పుడప్పుడు వచ్చి నిరాకారములో సంభాషించుట, చర్చించి వెళ్ళుట జరిగేది. అయితే శ్రీ శేషుబాబు వారి ఆత్మ సద్గురుస్థితి నుండి భగవంతుడిని మేల్కొల్పే అవతారుని స్థాయికి ఎదుగుటలో కొంత సాధన అవసరమైనది. అట్టి సాధనలో సహకరించుటకై సద్గురు శ్రీ సాయిబాబా వారు కొంత దీర్ఘకాలము సద్గురు శ్రీ శేషుబాబు వారి వద్దనే ఉండి సాంగత్యము చేయాలని సంకల్పించినారు. వారిని ఆహ్వానించుటకై శ్రీ గురుదేవులు శ్రీనుబాబులో జ్ఞానశక్తులను ప్రసాదించుట ద్వారా జ్ఞాన పీఠము నేర్పరచి, ఆ పీఠముపై తమ ప్రియతమ సోదరులగు శ్రీ శిరిడి సాయిబాబా వారిని ఆశీనులను చేసి ఆయనతో దీర్ఘకాలము సాంగత్యము చేసినారు.

శ్రీ శేషుబాబుగారు ఎవరు ? శ్రీ సాయిబాబా వారు ఆయనతో ఎందుకు సాంగత్యము చేసినారు ? శ్రీ శేషుబాబు వారికి శ్రీ సాయిబాబా వారితో గల బంధము ఏమిటి ? అనే విషయాలను మొదటిగా తెలుసుకుందాము. సృష్టిలో ఉన్న కోటానుకోట్ల నక్షత్రాలతో పోలిస్తే భూమి, భూమిపై నివసించే మానవుల జీవితాలు, కాల ప్రమాణాలు అత్యల్పమైనవి. ఈ అల్పత్వమును స్ఫురింపచేయుటకే పురాణాలలో ఒక్కొక్క యుగానికి కొన్ని లక్షల సంవత్సరాలు ఉన్నట్లుగా చెప్పినారు. నిజానికి మానవ చరిత్రలో అనేక యుగాలు కాలగర్భంలో కలసిపోతూ ఉంటాయి. శ్రీరామయుగానికి ముందరి యుగముల చరిత్రలన్నీ కాలగర్భంలో కలసిపోయినాయి. శ్రీరామయుగము పూర్తియై తదుపరి శ్రీ బుద్ధయుగము కూడా పూర్తియై ప్రస్తుతము శ్రీ మెహర్‌యుగము ప్రారంభమై నడచుచున్నది. కొంత కాలానికి ఈ యుగములు కూడా క్రమక్రమముగా కాలగర్భంలో కలసిపోతూ క్రొత్త యుగములు వస్తూ ఉంటాయి. ప్రతి యుగములోను ముగ్గురు అవతార పురుషులు అవతరిస్తుంటారు. శ్రీరామయుగమునందు భగవంతుడు శ్రీరామునిగ, శ్రీకృష్ణునిగ, శ్రీ దత్తాత్రేయునిగ అవతరించినారు. శ్రీ బుద్ధయుగము నందు భగవంతుడు శ్రీ బుద్ధునిగ, శ్రీ యేసుక్రీస్తు ప్రభువుగ, శ్రీ మహమ్మద్ ప్రవక్తగ అవతరించినారు. ప్రస్తుత శ్రీ మెహెర్‌యుగము నందు భగవంతుడు శ్రీరాముని, శ్రీ బుద్ధుని స్థానములో శ్రీ మెహెర్ బాబాగా అవతార కార్యక్రమమును చాలించినారు. ఇప్పుడు శ్రీకృష్ణుడు, శ్రీ క్రీస్తుప్రభువు స్థానములో



CONTINUE...

శ్రీ శేషబాబు గారు శ్రీ కృష్ణశేషగ అవతార కార్యము ప్రారంభించినారు. భవిష్యత్తులో శ్రీ శిరిడి సాయిబాబా అవతారుని స్థాయికి ఆత్మోన్నతి చెంది శ్రీ దత్తాత్రేయ, శ్రీ మహమ్మద్ ప్రవక్త స్థానములో అవతరించనున్నారు.

భగవంతుని చేరుకొనుటకు జాలి, ఆత్మవిమర్శ, వైరాగ్యము అనే మూడు మార్గములున్నవి. శ్రీ మెహెర్ యుగములో శ్రీ మెహెర్‌బాబా వారు వైరాగ్యమార్గము ద్వారా పరిపూర్ణులై అవతారునిగ అవతరించినారు. ఆత్మవిమర్శ మార్గములో శ్రీరామకృష్ణ పరమహంసవారు, జాలి మార్గములో శ్రీ సాయిబాబావారు పరిపూర్ణులై అవతారుని స్థానమును పొందుటకు అర్హత సాధించినారు. శ్రీ సాయిబాబా వారి చరిత్రలో ఆయన మూడు రోజులు సమాధి చెంది, తరువాత మరల దేహముతో మేల్కొనిన సంఘటన జరిగినది. అదే సమయములో శ్రీరామకృష్ణ పరమహంసవారు కలకత్తాలో దేహత్యాగము చేయుట జరిగినది. శ్రీ సాయిబాబావారు తిరిగి జీవించిన పిదప తమ శిష్యుడగు శ్రీ మహల్సాపతితో ఈ విధంగా చెప్పినారు. "నేను అల్లా దగ్గరకు వెళ్ళిపోవాలనుకున్నాను. కానీ కలకత్తాలో గధాదర్ అనే నా సోదరుడు కూడా అల్లా వద్దకు వెళ్ళుటకై తొందరపడుచుండుట చేత ముందుగా ఆయనను వెళ్ళనిచ్చి నేను వెనుకకు వచ్చేసినాను" అని చెప్పియున్నారు. అవతారుని స్థాయిని అందుకొనిన శ్రీరామకృష్ణ పరమహంస వారు జీవిత కాలమంతా మాయకు దూరముగా సత్వగుణమునకు, సత్యమునకు చేరువగానే జీవించినారు. అయితే ప్రేమాస్వరూపుడగు భగవంతుడు మంచివారిని, చెడ్డవారిని, సాత్వికులను, పాపులను అందరినీ సమానముగానే ప్రేమించుచున్నారు. అలాగే శ్రీరామకృష్ణ పరమహంస వారు అవతారుని స్థానమునకు చేరుటకు ముందుగానే పాపులను, చెడ్డవారిని కూడా ప్రేమించే కర్మ మిగిలిపోవుటచేత ఆ కర్మ నెరవేర్చుటకు, మరియు సద్గురు ఆత్మను అభివృద్ధి చెందించి అవతారుని మేల్కొల్పుటకు సద్గురు శ్రీ శేషబాబుగారిగా ఈ జన్మలో జన్మించియున్నారు.

మానవుడు సత్వ, రజో, తమో గుణముల కలయిక. మనిషి సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకుని సాత్వికుడిగ, తదుపరి మంచివానిగ, నీతిపరునిగ, ధర్మపరునిగ, పండితునిగ, సాధుపురుషునిగ, సత్పురుషునిగ, మహర్షిగ అనేక జన్మలలో సాధన చేస్తూ ఉత్తీర్ణుడైన పిదప గురుస్థితిని పొందుతారు. గురుస్థితి నుండి సద్గురు సిద్ధిని పొందుతారు. ఈ విధమైన సాధనా క్రమములో ఒక స్థాయిలో సాధన చేసినాక ఆ స్థాయిని వదిలేసి, అంతకంటే పెద్ద స్థాయిలో సాధన చేయాల్సి ఉంటుంది. ఎల్.డి.సి. ఉద్యోగము చేస్తున్న వ్యక్తికి యు.డి.సి. ప్రమోషన్ వస్తే ఎల్.డి.సి. ఉద్యోగము వదిలేసినట్లుగ ఒక్కొక్క స్థాయిని దాటుకుంటూ జాలి, వైరాగ్యము, ఆత్మవిమర్శ సంపూర్ణముగా మేల్కొనియుండే సద్గురు స్థితికి చేరుకొనుటయే ఆధ్యాత్మికముగా అత్యున్నతమైన స్థాయి అయి ఉన్నది. కాని అత్యున్నత సాధనతో అంతటి స్థాయికి చేరుకున్నాకా ఆధ్యాత్మికత కూడా మార్గమే గానీ గమ్యము కాదని తెలస్తుంది.



CONTINUE...

సర్వగుణాతీతుడైన భగవంతుడు ఆధ్యాత్మికతకు కూడా అతీతుడని, జాలి – వైరాగ్యము – ఆత్మవిమర్శలనే అత్యున్నత ఆధ్యాత్మికతను కూడా వదిలేస్తేనే భగవంతుని పొందగలమని, అప్పుడే భగవంతుడు ఆ ఆత్మలో మేల్కొంటారని తెలుస్తుంది. ఇదియే చిట్ట చివరి సాధన. ఈ సాధన దాటితే భగవంతుడు మేల్కొని భగవంతునిగ మారిపోతారు.

భగవంతునికి ఇంక ఎట్టి సాధనయు ఉండదు. భగవంతునికి మంచి, చెడ్డ, ఆధ్యాత్మికత నాస్తికత అన్నీ ఒక్కటే. అన్నింటిలోను అందరిలోను తానే నిండియుండి, ఈ విశ్వమనే ఆటను తానే ఆడుచున్నారు. ఈ విశ్వమంతా భగవంతుడు కంటున్న కల వంటిదే. కలలో వచ్చే పాత్రల యొక్క బాధలు, సుఖాలు అన్నీ కలకంటున్నవాని మనస్సుకే వర్తిసాయి. కలలోని అన్ని పాత్రలకు ఒకే మనస్సు ఉంటుంది. కలగంటున్న వాని మనస్సే అన్ని పాత్రలయొక్క అనుభూతులను అనుభవిస్తుంది. అలాగే సృష్టిలోని సమస్తము భగవంతుడే అయియున్నారు. సృష్టిలోని ప్రతి జీవి యొక్క అనుభూతిని భగవంతుడే అనుభవించుచున్నారు. చంపుతున్న వానిలోను, చంపమని ప్రోత్సహిస్తున్నవానిలోను అందరిలోను భగవంతుడే ఉండి ఆ అనుభూతి పొందుచున్నారు. ఈ సృష్టియంతా భగవంతుని నుండి పుట్టి, భగవంతునిలోనే జీవించి, చివరకు భగవంతునిలోనే కలసిపోతూ ఎల్లప్పుడూ భగవంతుడే అయియున్నది. భగవంతునికి అన్యముగా ఏదీ లేదు. భగవంతునికి మంచివారు, చెడ్డవారు అందరూ తన స్వరూపమే అయియున్నారు కాబట్టి ఎవరిపైనా ఎట్టి భేదభావము లేదు ఆయనకు ఎట్టి సాధనా లేదు. కావున ఆధ్యాత్మికత, జాలి, వైరాగ్యము, ఆత్మవిమర్శలను కూడా భగవంతుడు ధరించియుండరు. కేవలము ప్రేమ స్వరూపమే భగవంతుడు అయియున్నారు. ప్రేమస్వరూపమైన భగవంతుడు తన నుండియే ఉద్భవించి, తన స్వరూపమే అయియున్న సృష్టినంతటినీ సంపూర్ణముగా ప్రేమిస్తూనేయుంటారు. అదే విధముగా ఎవ్వరైతే మంచిని, చెడ్డను, ఆధ్యాత్మికతను సమస్తమును విడచి భగవంతుడినే ప్రేమిస్తారో వారు ఆ ప్రేమ సాగరములో కలసిపోతారు వారు భగవంతుడే అయిపోతారు. ఇదియే అవతారునిస్థితి అయియున్నది. పరిపూర్ణ ఆత్మవిమర్శకుడైన సద్గురు శ్రీ శేషబాబు వారిచేత ఆత్మవిమర్శను, ఆధ్యాత్మికతపైన శిష్యులపైనగల మమకారమును జాలిని వైరాగ్యమును విడిచిపెట్టేయునట్టి చిట్టచివరి సాధన పూర్తి చేయించి, అవతారునిగా మేల్కొల్పుటలో సహకరించవలెననే సంకల్పముతోనే, శ్రీ గురుదేవులచే పెద్దన్నయ్యగా సంభోదించబడే సద్గురు శ్రీ సాయిబాబావారు వచ్చి దీర్ఘకాలము శ్రీ శేషబాబువారితో సాంగత్యము చేసియున్నారు.

శ్రీ సాయిబాబా వారు కొన్ని సంవత్సరములు పాటు శ్రీ గురుదేవులతో సాంగత్యము చేస్తూ, సంభాషిస్తూ ఇక్కడే ఉన్నారు.



CONTINUE...

శ్రీ సాయిబాబావారు ఇలాగ అనేక విధాలుగా నచ్చచెప్పి శ్రీ శేషుబాబు గారిలో మేల్కొనియున్న ఆత్మవిమర్శ, జాలి, వైరాగ్యములను ఆయనచే గుర్తింపచేసి, వాటినన్నింటిని అధిగమించి భగవంతుని ఒక్కరినే పట్టుకుని అవతారునిగ భగవంతుడు మేల్కొనుటలో సంపూర్ణముగా సహకరించినారు. నేను భగవంతుని శిష్యుడను, భక్తుడను అని భావించే ద్వైత భావముతో ఉన్న శ్రీ గురుదేవులు నేనే భగవంతుడను అని భావించే అద్వైత జ్ఞాన భావమును పొంది, అవతారునిగ భగవంతుడు మేల్కొనుటలో సంపూర్ణముగా సహకరించినారు. 22-11-1998వ తేదీన సద్గురు శ్రీ శేషుబాబు వారిలో భగవంతుడు మేల్కొని అవతారులైనారు. అటుపిమ్మట తాము వచ్చిన కార్యక్రమము సఫలీకృతమైనదనే ఆనందముతో శ్రీ సాయిబాబావారు ఆనందముగా ఈ పరిధి నుండి నిష్క్రమించినారు.

శ్రీ సాయిబాబాతో సాంగత్యము గురించి తదుపరి కాలములో శ్రీ గురుదేవులు ఇలా చెప్పియున్నారు. "భగవంతుడు నాకు తెలియచేస్తున్న సత్యవిషయాలను అందరితో పంచుకోవాలనే ఆతృత నాకుండేది. సుమారుగ 1970 నుండి నాకెరుకయ్యే సత్యవిషయాలను అందరితో మాట్లాడేసేవాడిని. స్నేహితులు, పరిచయస్తులే కాదు, రోడ్డు మీద నడుస్తుండగా కనిపించిన వారితో కూడా మాట్లాడేసేవాడిని. కొంతమందికి నేను చెబుతున్నది ఏమిటో కూడా అర్ధమయ్యేది కాదు. కొంతమంది నేను చెబుతున్న దానికి వ్యతిరేకముగా అర్ధము చేసుకునేవారు. కొంతమంది మాత్రమే నేను చెబుచున్నది కొద్దిగానైనా అర్ధముచేసుకునే వారు. నా భావాలను పూర్తిగా అర్ధం చేసుకునేవారు నాకు ఎవ్వరూ దొరికేవారు కాదు. అందువలన నాలో ఒక కోరిక ఉండేది. భగవంతుడు నాకు తెలియచేస్తున్న సత్యసూత్రాలను నాతో సమానముగా అర్ధము చేసుకుని సంభాషించే ఒక్క స్నేహితుడైనా నాకుంటే బాగుంటుంది. నాకు తెలియని సత్యవిషయాలను కూడా నా స్నేహితుడు అర్ధం చేసుకుని వాటిని నాకు అర్ధమయ్యేలా చెప్పుటకు ప్రయత్నిస్తుంటే నేను వాటిని శ్రద్ధాసక్తులతో వింటూ, అర్ధం చేసుకుంటూ ఉండాలి" అని కోరుకునేవాడిని. పరమతండ్రి దయవలన శ్రీసాయిబాబా వారి సాంగత్యముతో నాయొక్క చిరకాల కోరిక తీర్చబడినది. నా జీవితములో నేను ఎంతో మందితో స్నేహము చేసినాగానీ నాకు పూర్తి తృప్తి కలుగలేదు. కానీ నిరాకారములోని శ్రీ సాయిబాబా వారితో స్నేహము ఒక్కటే నాకు పూర్తి తృప్తినిచ్చినది. మా ఇరువురి సాంగత్యము మా ఇరువురికీ లాభాన్ని చేకూర్చినది. శ్రీ సాయిబాబా వారి సాంగత్యము నేను సద్గురు గుణములైన ఆధ్యాత్మిక మమకారము, ఆత్మవిమర్శలను విడనాడి భగవంతుడొక్కరినే పట్టుకొనుటలో సహకరించి, భగవంతుడు మేల్కొనునట్లు చేసి లాభము కలిగించినది. శ్రీ సాయిబాబావారు కూడా నా సాంగత్యములో నాతో బాటుగా పాఠాలు నేర్చుకుని శిష్యమమకారము, జాలి అనే సద్గురు లక్షణాలను విడనాడి తనలోని



continue...

భగవంతుడు మేల్కొనుటకు సంసిద్ధులగుట ద్వారా నా సాంగత్యము వలన లాభము పొందినారు. నా అవతార కార్యము పూర్తియైన పిదప ఈ యుగములోని మూడవ అవతారముగ శ్రీ సాయిబాబా వారు అవతరిస్తారు. ఈ జన్మలో నేను సద్గురు స్థితి నుండి సాధన చేసి అవతారుని స్థాయికి చేరుకొనినాను. కానీ శ్రీ సాయిబాబావారు ఆ సాధన నాతో కలిసి నిరాకారములోనే పూర్తిచేసియున్నందున వారి అవతార కాలములో ఇక ఇటువంటి సాధన అవసరముండదు. పూర్తిగా అవతారుని స్థితి కలిగి ఉండియే శ్రీ సాయిబాబావారు అవతారునిగ అవతరిస్తారు" అని శ్రీ శేషుబాబు గారు చెప్పియున్నారు.

